పారిశుద్ధ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి: డీసీ

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ సూచించారు. సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన ఎస్ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి షాపులో రెండు డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. అందులో నల్లటి కవర్ పెట్టి ఉంచాలని... వీటిని ఆటో రిక్షాలకు అనుసంధానం చేయాలన్నారు. రోడ్లపై చెత్త వేస్తున్న వారిని గుర్తించి రూ. 1000ల నుంచి రూ. 5000ల వరకు ఆన్లైన్ ద్వారా జరిమానాలు విధించాలని ఎస్ఎఫ్ఏలకు సూచించారు. రెండోసారి చెత్త వేస్తే ఫైన్ను రెట్టింపు చేసే విధించి షాపు లైసెన్స్ రద్దు చేయాలని సూచించారు. ప్రతి షాపులో రెండు డస్ట్బిన్లు పెట్టాలని... పెట్టని వారు జరిమానా విధించాల్సి వస్తుందన్నారు. పెనాల్టీ విధించిన తరువాత కేవలం ఆన్లైన్ ప్లాట్ ఫార్మ్ ద్వారా మాత్రమే చెల్లించాలని... సిబ్బంది చేతికి డబ్బులు ఇవ్వకూడదన్నారు. ప్రతి వార్డుకి మూడు మెంబర్లతో రెండు టీమ్లను ఏర్పాటు చేశామన్నారు. అన్ని టీమ్లు వారికి కేటాయించిన వార్డులను సందర్శించి రోడ్లపై చెత్త వేస్తున్న టీ బండ్లు, వీధి వ్యాపారులు, వైన్షాపు వారు, వ్యాపారస్తులను గుర్తించి రోజూ 15 నుంచి 20 షాపులకు జరిమానాలు విధిస్తామన్నారు. ప్రజలు కూడా చెత్తాచెదారాన్ని బహిరంగంగా వేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. జీహెచ్ఎంసీకి పారిశుద్ధ్య నిర్వాహణలో తమ వంతు సహకారం అందించాలన్నారు

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ

బండ్లగూడ: కశ్మీర్ పహల్గామ్లో అమాయక పర్యాటకులను అత్యంత కిరాతకంగా చంపిన ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ అన్నారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మ శాంతి కలగాలని ప్రార్థిస్తూ పలు కాలనీల్లో కొవ్వొత్తులు చేతబట్టి ర్యాలీ చేపట్టారు.

హైదర్గూడలో...

అత్తాపూర్: కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల అరాచకానికి నిరసనగా అత్తాపూర్ డివిజన్ హైదర్గూడలో పౌర సంఘాల ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి పాత బస్టాండ్ చౌరస్తా వరకు శనివారం సాయంత్రం జరిగిన ర్యాలీలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీ శంకర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మల్లారెడ్డి, కొమురయ్య, కొలన్ సుభాష్రెడ్డి, మ్యాడం రామేశ్వర్రావు, శేఖర్రెడ్డి, మ్యాడం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు అంకితభావంతో పనిచేయాలి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యాబోధన చేసి ఉత్తమ సమాజాన్ని నిర్మించాలని నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ముదిరాజ్ అన్నారు. నార్సింగిలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో రాష్ట్ర ఉపాధ్యాయ ఐక్య ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) జిల్లా సమావేశాల్లో వారు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలను కల్పించటంతో పాటు వాటిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటప్ప మాట్లాడుతూ... ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కనీస వసతులను కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు జగన్నాథశర్మ, రఘుపాల్, సుగంధ, జిల్లా నేతలు భగవంత్రాజ్, నర్సింహులుగౌడ్, రాములు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఆరుగురి అరెస్టు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సన్సిటీ పీఅండ్టీ కాలనీలో దోపిడీకి పాల్పడిన ఆరుగురు నిందితులను రాజేంద్రనగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. నిందితులు ఉపయోగించిన స్విఫ్ట్ కారుతో పాటు రెండు కత్తులు, రెండు సెల్ఫోన్లు, చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు బాధితునికి అల్లుడు కావడం గమనార్హం. రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం... సన్సిటీ పీఅండ్టీ కాలనీలో మహ్మద్ షకీర్ అలీ తన కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. సాఫ్ట్వేర్ ఉద్యోగి అయిన షకీర్కు మైలార్దేవ్పల్లికి చెందిన కారు డ్రైవర్ జబ్బార్ (28) అల్లుడు అవుతాడు. దగ్గరి బంధువు కావడంతో ప్రతి వారం ఇంటికి వస్తూ పోతూ ఉంటాడు. షకీర్ ఇంట్లో డబ్బు, నగలు ఎక్కడ ఉంటాయో వాటిని గమనించేవాడు. ఇదిలా ఉండగా జబ్బార్ షకీర్ ఇంట్లో దోపిడీ చేసి డబ్బులు ఈజీగా దొంగలించవచ్చని తన స్నేహితులైన మహ్మద్ అఖిల్ (26), ఫసివుద్దీన్ (27), సోహెల్ (26), అబ్దుల్ జావీద్ (26), షబ్బీర్ (28)లకు తెలిపాడు. వీరంతా కారు డ్రైవర్లు. జబ్బార్ తమ కారులోనే వెళ్లి ఈజీగా దోపిడీ చేయవచ్చని తెలపడంతో ముందుగా ప్రణాళికలు రూపొందించారు. షకీర్ ఇంటి సమీపంలో సీసీ కెమెరా ఉండటంతో జబ్బార్ తన స్నేహితులతో కారులో వచ్చిన దృశ్యాలు, దోపిడీ చేసిన అనంతరం వెళ్లి దృశ్యాలన్నీ రికార్డు అయ్యాయి.

దారులన్నీ ఓరుగల్లుకే..


హైదర్గూడ జనప్రియ ప్రాంతంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న నియోజకవర్గ ఇన్చార్జి పట్లోళ్ల కార్తీక్రెడ్డి


అత్తాపూర్ చౌరస్తాలో...

- వాడవాడలా బీఆర్ఎస్ జెండాల ఆవిష్కరణలు
- వరంగల్ సభ విజయవంతమే లక్ష్యం
- పెద్ద ఎత్తున తరలిన గులాబీ శ్రేణులు
- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం బీఆర్ఎస్తోనే సాధ్యం
- ధీమా వ్యక్తం చేస్తున్న పార్టీ నేతలు

అత్తాపూర్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జీ పట్లోళ్ల కార్తీక్రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం అత్తాపూర్ డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఈ నెల 27న రజతోత్సవ సభను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. వరంగల్లో జరిగే ఈ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్తున్నామన్నారు. ఉదయమే ఈ సభకు వెళ్లనున్న నేపథ్యంలో ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఒకరోజు ముందుగానే జెండా ఆవిష్కరణలను నిర్వహించామన్నారు. రానున్న రోజుల్లో ఏ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు కొలన్ సుభాష్రెడ్డి, చిట్టిగారి నరేందర్, జాలిగం చిత్తారి, హనుమంతరెడ్డి, రవీందర్గౌడ్, రాముయాదవ్, నరేందర్, అప్పారెడ్డి ముఖేష్, పుష్పాల లక్ష్మణ్, అజయ్కుమార్, రెబ్బా సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్కు పూర్వ వైభవం తథ్యం...

మైలార్దేవ్పల్లి: బీఆర్ఎస్కు పూర్వ వైభవం తిరిగి రానుందని ఆ పార్టీ మైలార్దేవ్పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. మైలార్దేవ్పల్లి డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఓల్డ్ కర్నూల్ రోడ్, శ్రీరామ్నగర్, ప్రేమావతి పేట్ తదితర ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు కొంపల్లి జగదీష్, రమేష్ ముదిరాజ్, సోమ శ్రీనివాస్ గుప్తా, రఘుయాదవ్, సూర్యం, రాజు, అనిల్, అరుణ, భూదేవి, దుర్గేష్, భాస్కర్, సలీం, వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ డివిజన్లో...

రాజేంద్రనగర్: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలను పురస్కరించుకొని పార్టీ డివిజన్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ప్రతి గ్రామంలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. నేతలు వీర్లపల్లి నవీన్, సుబ్బారావు, కావేలి గిరిబాబు, కట్టెలమండి గౌతం, సుజాత, మంజుల, సుమలత, సుల్తానా, శరత్గౌడ్ ఉదయ్ కుమార్ రెడ్డి, సాయితేజ, సందీప్ రెడ్డి, రాజు గౌడ్, రంజన్, ఇద్రీస్, కృష్ణారావు పాల్గొన్నారు.


రాజేంద్రనగర్లో కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్, ధర్మారెడ్డి...


మైలార్దేవ్పల్లిలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్...

దోమల బారినుంచి కాపాడండి


వెంకటేశ్వర కాలనీలో సెల్ఫోన్ లైట్లను వెలిగించి నిరసన తెలుపుతున్న ప్రజలు

మణికొండ: రాత్రి అయ్యిందంటే దోమల బాధ.. రోజంతా దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాటిని నివారించి తమ ఆరోగ్యాలను పరిరక్షించాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్ షిప్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలు, వెంకటేశ్వర కాలనీ, పాషా కాలనీ, ఖాజాకాలనీల ప్రజలు నినదించారు. శనివారం సాయంత్రం గ్రేటర్ అలకాపూర్ రెసిడెన్షీ వెల్ఫేర్ అసోసియేషన్(గర్వ) పిలుపు మేరకు రోడ్డు నెంబర్ 13 నుంచి నెక్నాంపూర్ చెరువు వరకు శాంతి ర్యాలీని నిర్వహించారు. వెంకటేశ్వర కాలనీ ప్రవేశం నుంచి నెక్నాంపూర్ పెద్ద చెరువు వరకు ఆయా కాలనీల ప్రజలు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్వ అధ్యక్షుడు ఉత్తమ్కుమార్ రెడ్డి, వెంకటేశ్వరకాలనీ అధ్యక్షుడు ఉపేంద్రనాథ్రెడ్డి, ది సిటిజన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరీఫ్ మాట్లాడుతూ... నెక్నాంపూర్ పెద్ద, చిన్న చెరువులలో మురికి నీరు చేసి దుర్గంధం వస్తుందన్నారు. అందులో విపరీతంగా గుర్రపుడెక్క పెరిగి దోమల వ్యాప్తికి కారణం అవుతుందన్నారు. దాంతో ఉదయం, రాత్రి సమయాల్లో ప్రజలు ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఉందన్నారు. మురికి నీటిని చెరువులలో కలవకుండా మళ్లించటం, గుర్రపుడెక్కను తొలగించటం పనులను వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి


గండిపేట చౌరస్తాలో నివాళులర్పిస్తున్న గేటెడ్ కమ్యూనిటీవాసులు


నార్సింగిలో నిరసన వ్యక్తం చేస్తున్న టీఎస్యూటీఎఫ్ నాయకులు

మణికొండ: పర్యాటకుల ప్రాణాలు తీసిన పాకిస్తాన్ ఉగ్రవాదులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ నాయకులు, ప్రజలు డిమాండ్ చేశారు. దేశానికి తలమానికంగా కాశ్మీర్ను వేల కోట్ల నిధులను వెచ్చించి అభివృద్ధి చేసి పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్న దశలో ఇలాంటి ఉగ్రదాడులకు పాల్పడటం ప్రపంచ వ్యాప్తంగా మాయని మచ్చగా నిలిచిపోతుందన్నారు. అలాంటి వారికి తగిన రీతిలో గుణపాఠం చెబితేనే ప్రపంచ వ్యాప్తంగా మన దేశ టూరిజంపై విశ్వాసం కలుగుతుందన్నారు. తాత్సారం చేయకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలను మొదలు పెట్టాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు పి.చంద్రశేఖర్రెడ్డి, నాయకులు బి.సురేష్, జగన్మోహన్రెడ్డి, చంద్రశేఖర్, సుమన్, మాజీ కౌన్సిలర్ ఆదిత్య రెడ్డి, లెజెండ్ చైమ్స్, ఈఐపీఎల్ అపిల గేటెడ్ కమ్యూనిటీ, మగదా విలేజ్, రాజపుష్ప రిగాలియా రిట్రీట్, రాజపుష్ప ఆట్రియా తదితర గేటెడ్ కమ్యూనిటీల వాసులు పాల్గొన్నారు.

టీఎస్యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) ఆధ్వర్యంలో నార్సింగిలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద పెహల్గాం ఉగ్రదాడులను నిరసిస్తూ వారి ఆత్మలు శాంతించాలని నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ మాట్లాడుతూ... దేశంలో మరిన్ని ఉగ్రదాడులు చేసేందుకు అవకాశం ఉందని, వాటిని అరికట్టడంతో పాటు మన దేశం వైపు చూసేందుకే భయం కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మానవాళికి నష్టదాయకంగా ఉన్న ఉన్మాదులను ఏమతం వారైనా ఏరిపారేయాల్సిందేనన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, టీఎస్యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప పాల్గొన్నారు.

'సంక్షేమం'పై కమిషనర్ సమీక్ష

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ కార్యాలయంలో శనివారం కమిషనర్ శరత్చంద్ర అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్, చేయూత పెన్షన్ల వెరిఫికేషన్పై సమీక్షించారు. వెరిఫికేషన్ ఆఫీసర్స్కి ప్రభుత్వ మార్గదర్శకాలు వివరించి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను సమర్పించాలని సూచించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఆర్వో కె.శివకుమార్, ఏఈఈ వి.రాజ్కుమార్, వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఆపరేటర్లు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

అత్తాపూర్: పెళ్లి జరిగినప్పటి నుంచి భార్యను భౌతికంగా, మానసికంగా హింసిస్తున్న అబ్దుల్ ఖదీర్పై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐ నయింహుస్సేన్ సమాచారం మేరకు... కార్వాన్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఖదీర్(45) ఆటో డ్రైవర్. అత్తాపూర్ సులేమాన్నగర్కు చెందిన సమీనాసుల్తానా(35)తో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. తాగుడుకు బానిసైన అబ్దుల్ ఖదీదర్ భార్యను వేధిస్తున్నాడు. ఈ నెల 21న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. సమీనా సుల్తానా తమ్ముడు సమాద్ఖాన్ ఆమెజాన్ కంపెనీలో డెలివరీ బాయ్గా పని చేస్తున్నాడు. అక్క సంసారం విషయంలో కార్వాన్లో ఉన్న బావ ఇంటికి వెళ్లి కుటుంబ పోషణలో భాగస్వామిగా ఉండాల్సిన మీరు జులాయిగా తిరుగుతూ అక్క నమీనా సుల్తానాను శారీరకంగా, మానసికంగా హింసించడం ఏమిటని ప్రశ్నించాడు. దీంతో కక్ష పెంచుకున్న అబ్దుల్ ఖదీర్ ఈ నెల 26వ తేదీ అర్ధరాత్రి సమయంలో సులేమాన్నగర్లో ఉన్న అతని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించి పరారయ్యాడు. కుటుంబ సభ్యులు కనిపిస్తే పెట్రోల్ పోసి నిప్పంటించే వాడని అబ్దుల్ఖదీర్ నుంచి తమ కుటుంబ సభ్యులకు ప్రమాదం ఉందని సమీనాసుల్తానా ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆహార భద్రత, రైతుల ఆదాయ వృద్ధిపై దృష్టి సారించాలి

'నారమ్స్'లో ఘనంగా పీజీడీఎం, ఏబీఎం స్నాతకోత్సవం

ఏజీవర్సిటీ: జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ (నారమ్స్)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్మెంట్ (పీజీడీఎ) అగ్రి బిజినెస్ (ఎబీఎం) 5వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా (పద్మభూషణ్ అవార్డు గ్రహీత) ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్.ఎస్.పరోడా పాన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేసింది కీలక ఉపాన్యాం చేశారు. యువత కేవలం ఉద్యోగ అవకాశాల పైనే దృష్టి పెట్టకుండా ఆహార భద్రత, గ్రామీణ రైతుల ఆదాయం పెంచడం, పర్యావరణ స్థిరత్వంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా 2021, 2022, 2023వ బ్యాచ్లకు చెందిన 176 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. నారమ్మ డైరెక్టర్ గోపాల్ లాల్, పీజేటీటీఏయూ వీసీ అల్దాస్ జానయ్య, ఎస్.కె.రాజవేలు, ఆర్సీ అగర్వాల్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పట్టాలను ప్రదానం చేస్తున్న అతిథులు


పట్టాలు అందుకున్న ఆనందంలో విద్యార్థులు

20న సార్వత్రిక సమ్మె

మైలార్దేవ్పల్లి: మే 20వ తేదీన నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మికులు, వివిధ సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.జయలక్ష్మి పిలుపునిచ్చారు. కాటేదాన్లోని స్వప్న థియేటర్ చౌరస్తా వద్ద శనివారం జిల్లా స్థాయి సదస్సును నిర్వహించారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామిల అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల చర్యలను అమలు చేస్తున్నదన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా అమలు చే య కుండా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదన్నారు. కార్మిక చట్టాల స్థానంలో 4 లేబర్ కోడ్లను తెచ్చిందని దుయ్యబట్టారు.

అలకాపూర్ అభివృద్ధికి కృషి

మణికొండ: అలకాపూర్ టౌన్షిప్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు వంశీ అన్నారు. మూడు రోజులుగా జరుగుతున్న నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం శనివారంతో ముగిసింది. శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైన 21 మంది సభ్యులు శనివారం ప్రధాన ఎన్నికల అధికారి, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు, ఎన్నికల అధికారులు రాజశేఖర్, కాంతారావుల ఆధ్వర్యంలో పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అర్వపల్లి వంశీ, ఉపాధ్యక్షులుగా బి.శ్రీనివాసులు, డి.శశిధర్, ఎ.శేఖర్, టి.ప్రవీణ, ప్రధాన కార్యదర్శిగా డి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా సి.హెచ్.శ్రీధర్, టి.సంతోష్, కోశాధికారిగా వి.శంకర్దేవ్, సహాయ కోశాధికారులుగా పి.శ్రీనివాస్, బి.నాగార్జున, బి.ప్రదీప్కుమార్, పి.శివశంకర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎస్.వి.ఎస్.ఎస్.శర్మ, వెంకట రామనర్సింహ, బి.కృష్ణారెడ్డి, కె.మహేంద్ర, ఎం.ప్రవీణ్, ఎం.శ్రీధర్, పవన్కుమార్, ఎం.కిషన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ కోశాధికారి రవీందర్రెడ్డి టౌన్షిప్ వాసులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారులు